# నల్లపిల్లి

(కథానిక)

నాకు గాని, విశ్వనాథానికి గాని జంతుభాష రాదు. అదేవొస్తే రాత్రి పదకొండు తరవాత దాదాపు ఎల్లప్పుడూ నిర్మానుష్యంగా ఉండే ఆ వీథిలో కాపలా పని తప్పేదేమో. ఇంతకీ, పోస్టాఫీసు సందుమలుపుకి రెండిళ్ళవతల ఉన్న ఇంటి ప్రహరీ గోడమీద, ప్రతిరోజూ చీకటి పడేవేళకి ప్రత్యక్ష మవుతున్న నల్లపిల్లి మాకు తెగని సమస్య ఐంది. ఆ పిల్లి అయినా, ఏదో అలా ఓసారి కనపడి తన దారిన తాను పోతే దాన్ని గురించి మేము మెదడు పాడు చేసుకోవాలిసిన అవసరం ఉండేది కాదు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే పైన చెప్పిన నల్లపిల్లి ఉత్తర దక్షిణాలుగా ఉన్న ఆ రోడ్డుకి లంబాకారంలో ఉన్న ప్రహరీ గోడమీద, రోజూ సరిగ్గా అదే సమయానికి వెలిసి అలాగే గంటల తరబడి ఉండిపోవటం. ఇది అపూర్వమైన సంగతి అనీ, ముక్కుకు సూటిగా కాక అటూ ఇటూ చూస్తూ నడిచే అలవాటు గల మాలాంటి ప్రాణులకి అది చిక్కైన సమస్య కావటంలో వింత ఏమీ లేదనీ సుస్పష్టం. ఈ పిల్లి ఇటువంటి వింతవైఖరి అవలంబించటం మేం నాలుగయిదు రోజుల్నించీ చూస్తున్నాం. అయితే, అది కూర్చున్నది కూర్చున్నట్లుగా తదేక ధ్యానంతో రాత్రి ఎంతసేపు ఆ గోడ మీద ఉంటుందో తెలుసుకోవాలిసిన అవసరం ఉందనిపించింది మాకు. విశ్వనాథం ఉద్దేశం ప్రకారం అది అర్ధరాత్రి దాకా అలా నిమీలిత నేత్రాలతో, ప్రాపంచిక విషయాలకి దూరంగా ఆ గోడమీద కూర్చుని తరవాత వెళ్ళిపోవాలి. ఈ అభిప్రాయానికి వాడు ఎందుకు వొచ్చాడో తెలియదు. అడిగితే "అలా అనిపిస్తోంది" అన్నాడు. "నాకనిపించదేం?" అన్నాను. నేనీమాటలు అనటంతో వాడు అసలు సమస్య వొదిలి ఈ విషయం గురించి ఆలోచించసాగాడు. వాడి కళ్ళని చూసిన మీదట వాడికి ఇదో సమస్యగా తయారైందని సులభంగా గ్రహించాను. ఈ అనిపించటం, అనిపించక పోవటం అనేది సర్వ సామాన్యం అయినా, మనుషులందరూ సర్వసమానులని ఈనాడు అందరూ అంగీకరించే విషయమే అయినా, అది అందరికీ ఒకే విధంగా వర్తించక పోవటం దురూహ్యం. విశ్వనాథం ఈ సమస్యని ఛేదించాడు. "అది మనుషుల ఆలోచనా విధానాన్నీ, శక్తినీ బట్టి ఉంటుంది" అన్నాడు. ఈ సమాధానం తిరుగులేనిది. అయినా ఊరుకోక అన్నాను.

"ఈపిల్లి అర్ధరాత్రిదాకా ఇక్కడ ఉంటుందని ఏ ఆలోచనా విధానాన్ని అనుసరించి చెప్పావు?" అన్నాను.

"ఊరికే అనుకున్నాను. మనసుకి అలా తట్టింది."

వాడు మాట్లాడేది అంతర్వాణి విషయం కాబోలు. ఈ మధ్య అది ప్రతివాడికీ వినిపిస్తోంది. కాని, నాకింకా అలాంటి అదృష్టం పట్టలేదు. ఆ ఉక్రోషంతో అన్నాను.

"ఊరికే మనసుకి ఎలా తడుతుందిరా?"

"మనకి కొన్ని ఆలోచనలు ఉంటాయి. పుస్తకాలు చదివినమీదట అవి నిర్దుష్టంగా ఒక ఒరవడిలో పడటానికి అవకాశం ఉంది. ఈ ఆలోచనలు ఒక్కొక్కప్పుడు మనకి తెలియకుండా వాటంతటవే ప్రవేశించి మనకి సమస్యగా పరిణమించిన విషయంమీద ఒక అభిప్రాయాన్ని ఏర్పరుస్తాయి. ఇదంతా అంతర్వాహినిగా జరిగిపోయే సంగతి."

నేను కావొచ్చని తలూపాను. మనుషులు పిడివాదానికి ఒక్కొక్కప్పుడు ఎందుకు దిగుతారో, శుద్ధ పొరపాట్లు ఎందుకు చేస్తుంటారో,

"హితశ్రీ"

విశ్వనాథం థియరీ కొద్దిగా విపులీకరిస్తుందని పించింది.

“ఇంతకీ నల్లపిల్లి సంగతి వొదిలేసి వేరే మాటల్లో పడ్డాం. ఈ పిల్లిసంగతి తమాషాగా ఉంది.” అన్నాను.

విశ్వనాథం ఏమీ మాట్లాడకుండా, గోడ మీది పిల్లివైపు కాసేపు చూశాడు. అది ఏమాత్రం చలనం లేకుండా అలానే ఉంది. అర్ధరాత్రి కావొస్తోంది.

“మనుషులకి ఉన్నట్టే జంతువులకి కూడా భావోద్రేకాలుంటాయని ఒప్పుకుంటావా?”

“ఉంటాయేమో” అన్నాను తెలియని సంగతిని చర్చించట మెందుకని.

“అయిదురోజుల కిందట ఇక్కడో పిల్లి చచ్చిపోయింది” నేను వాడి ముఖంవైపు చూశాను. ఏదో రహస్యం కనిపెట్టినట్టున్నాడు.

“ఎలా తెలుసు?”

“చచ్చిపోయి ఉంటుందని నాకు గాఢ నమ్మకం,”

“అదా!”

“ప్రియురాలి మీద ఉండే అపార అనురాగం చంపుకోలేక రోజూ చీకటిపడే సమయం నుంచి అర్ధరాత్రిదాకానో, లేకపోతే భావసమాధి భగ్నమయేదాకానో ఆ నల్లపిల్లి అలా అక్కడ విచారంగా, ఏదో పిల్లి చచ్చిపోయి ఉంటుందని మనం ఊహించిన ఆ ప్రదేశం వైపు చూస్తూ నిశ్చలంగా, నిమీలితంగా కాలం గడుపుతోందని నా టిప్పణి.”

నిజానికి నాకు నవ్వొచ్చింది. కాని వాడు ఫీలవుతాడేమోనని అనుకున్నాను. వాడు చెప్పినదానితో నేను ఏకీభవించ లేకుండా ఉన్నాను.

“ప్రపంచాన్ని పరిపాలించేది ప్రేమ. మనుష్యులేమిటి, జంతువులేమిటి. అంతా ఆ మహత్తరశక్తికి వశులై, ఆ పారలౌకిక సంబంధం తెంచుకోలేక జీవితాలు గడుపుతారు. ఇది నిజం కాదంటావా?”

“ఊఁ” అన్నాను కాని, నా దృష్టి ఆ నల్ల పిల్లి కూచున్న ప్రహరీ గోడకి ఎదురుగా ఉన్న పూరి గుడిసెకి ముందు బోర్లించి ఉన్న కోళ్ళ బుట్టమీద ఉంది. నా అభిప్రాయం నల్ల పిల్లి దృష్టి కూడా అక్కడే ఉందనీ, ఓపిక, దీక్షగల జంతువు కావటం మూలాన సమయం కోసం నిరీక్షిస్తోందనీ.

మా అభిప్రాయాల సంగతి ఒక క్షణం మర్చిపోయి ఆ నిమిషాన మా ఉనికిని గురించి ఆలోచిస్తే చాలా హాస్యాస్పదంగా ఉంది. ఈ విషయం ఎవరికైనా తెలిస్తే వాళ్ళకి కావలసినంత ఉబుసుపోక. అయితే ఇది పైకి కనిపించేటంత నవ్వాలిసిన విషయం కాదని మనసుకి నచ్చచెప్పుకున్నాను. ఏదైనా ఓ కొత్త విషయం తెలుసుకోటం కోసం ఆమాత్రం శ్రమపడాలిసి ఉంటుంది. మరి, విశ్వనాథం బుర్ర దీన్నిగురించి చాలా తర్జనభర్జనలు పడుతోంది. వాడి స్వభావం అలా ఉంచి, వాడో పత్రికకి కరెస్పాండెంటు. వాడి కిలాంటి వాటిలో తాపత్రయం ఉండటం సహజమూ, ఉద్యోగ ధర్మమూ. వాడు పిల్లిని వెంటాడి, అసలు సంగతి కనిపెట్టాలనే దీక్షలో ఉన్నాడు. ఈ పిల్లి చేసే చర్యలో వెనక చరిత్రకి ప్రాధాన్యం ఉందని వాడినమ్మిక.

ఇలా నేను ఆలోచిస్తూండగా, వెన్నెల క్రమంగా నీడగా మారింది. చూస్తే చంద్రుడి చుట్టూ ఓ పెద్ద నల్ల మేఘం ఆవరించింది. ఆ నలుపులో నల్ల పిల్లి జాడ కనిపించలేదు. కొంప తీసి, అది ఈ సమయంలో ఉడాయిస్తుందేమోనని భయం వేసింది. ఎందుకైనా మంచిదని ఆ గోడవైపుకు నడక సాగించాము. ఆకాశం అకస్మాత్తుగా అర నిమిషం సేపు గర్జించింది. ఇహ వాన కురిస్తే మా అవస్థ వేరే చెప్పక్కర్లేదు.

మబ్బు విడిపోయేసరికి మేం పిల్లికి ఓ పది గజాల దూరంలో నుంచుని ఓ నీడను చూసి ఉలిక్కిపడ్డాము. గోడ పక్కగా ఓ మూర్తి కదులుతోంది. విశ్వనాథం నా వీపు గోకాడు. నెమ్మదిగా “చూశాను” అన్నాను. మా ఆలోచనలకి ఎక్కువ వ్యవధి లేకుండానే మరుక్షణంలో మేము స్తంభీభూతులం అయేటటువంటి ఓ పని జరిగిపోయింది ఆ వ్యక్తి చేతిలోని గోనె సంచి తటాలున పిల్లిమీద బోర్లించి, దాన్ని లోపలికి తోసేసి మూతి బిగించాడు. ఏదో చిన్నగా గొణిగినట్టుగా కూడా మాకు

వినిపించింది. విశ్వనాథం నోరు తెరచి మరు క్షణంలో తెలివి తెచ్చుకుని, తన సానుభూతికి పాత్రమైన ఆ పిల్లి దురవస్థకి చింతించి, నా చెయ్యి పట్టుకుని జరజర ఆ వ్యక్తి దగ్గిరికి లాక్కువెళ్ళాడు. మిమ్మల్నిద్దర్నీ చూసి అతను మొదట తెల్లబోయి తరవాత ప్రశ్నార్థకంగా మావైపు చూడసాగాడు.

విశ్వనాథంది కొంచెం దుడుకు స్వభావం. మాట తొందరమనిషి. వ్యవహారజ్ఞానం బొత్తిగా లేనివాడు. కొంచెం కోపంగా అన్నాడు. "ఆ పిల్లి మిమ్మల్నేం చేసింది?" ఈ అనుకోని అనవసరమైన జోక్యానికి ఆ వ్యక్తి మొదట తెల్లబోయి తరవాత క్రుద్ధుడైనట్టు తెలియచేస్తూ తీక్ష్ణంగా జవాబిచ్చాడు. "ఏంచేసిందా, ఇంకేం చెయ్యాలి? దీని సిగతరగా. రోజూ కోడిపిల్లని పొట్ట పెట్టుకుంటే మేం బతికేదెట్లా?"

విశ్వనాథం ముఖం వాడిపోయింది. మనిషి తలకిందులైనట్టు స్పష్టపడ్డది. నేను కలగ చేసుకుని అన్నాను సానుభూతి పూర్వకంగా.

"దీని దుంపతెగ, రోజూ కోడిపిల్లల్ని ఎత్తుకుపోతోందా?" మేం తగ్గటంచూసి, ఆ వ్యక్తి విజృంభించటం ఇహ అనవసరమనుకుని తన చర్యని ఇంకా కొంచెం సమర్థించుకుంటున్నట్టుగా మాట్లాడసాగాడు.

"ఇన్నాళ్ళనించి ఏదో పాపం, అని ఊరుకుంటుంటే మితిమీరిపోతోంది. ఏదో పట్నం నించి పట్టుకొచ్చి పెంచుకుంటున్నాడు కదా ఆ ఇంటోరి అబ్బాయి అని దయతలిస్తే మా కొంప కూలుస్తుండది. న్యాయం చెప్పండి. అయినా ఇవి న్యాయానికి రోజులు కావు లెండి. పిల్లిని సరిగా పెంచుకోలేక ఊళ్ళోవాళ్ల కోళ్ళ మీద కొదిల్తే ఎవ రూరుకుంటారు? మామీద కచ్చ ఉంటే ఉండొచ్చు. చేతనైతే ఎదురుగా రావాల. అంతే కాని," సంగతి కొంచెం కొంచెంగా బోధపడుతోంది. విశ్వనాథం పూర్తిగా కుంగిపోతున్నాడు.

"ఏమిటోయ్ అసలు సంగతి?" అన్నాను.

"అల్లదొడ్లో రకరకాల మొక్కలున్నయ్యంట. కొత్తకొత్త వింతనా తేశారంట. రోజూ మాకోళ్ళొచ్చి అవన్నీ తవ్వి పాడు చేస్తున్నయ్యని ఆ ఇంటోళ్ల అబ్బాయి-పట్నంలో మొక్కల్ని పెంచటం చదువుకొచ్చాట్ట లెండి ఫిర్యాదు చేశాడు. నోరులేని పక్షులు. ఏం చేస్తాం చెప్పండి. అక్కడికీ రాత్రింబగళ్లు బుట్టలోనే ఉంచుతాం. ఎప్పుడో ఒకటో, రెండో కోళ్లు అల్ల దొడ్లోకి పోయినాయి కామాలె. అట్లాగని వాటిమీదికి పిల్లి నొదుల్తాడా? పట్నం నించి పట్టుకొచ్చాట్ట మాలావు పిల్లి."

అనర్గళంగా దుమ్మెత్తి పోస్తున్నాడతను. నేను విశ్వనాథంవైపు చూశాను. వాడికి ఏదో ఆలోచన మెరిసినట్టుంది.

"అయితే ఈ పిల్లి రోజూ సాయంత్రం నించి ఇక్కడ మకాం వెయ్యటం ఇందుకేనన్నమాట?" అడిగాడు.

"మరెందు కనుకుంటారు?"

"ఇవాళకూడా కోడిపిల్లని ఎత్తుకు పోయిందా?"

"ఈ వెధవ పిల్లి, దీనమ్మ కడుపు కాల, కోడిపిల్లని అంకించుకుని పరుగుతీసింది. పైగా ఒంటి కాలి కొంగలా ఎట్టా కూచున్నదో గోడమీద ఏమీ ఎరగనట్టు!"

కోళ్ళ బుట్టవైపు చూశాను. అవి ప్రశాంతంగా ఉన్నాయి. నాకో ధర్మ సందేహం కలిగింది.

"అయితే బుట్టలోకి పిల్లి ఎలా వెళ్ళింది?" ఆ వ్యక్తి నా వైపు చురచుర చూశాడు.

"సినబద్దాలు చెబుతున్నానంటారా?"

"అహఁ, అదికాదు ఎలా వెళ్లిందా అని?"

"పోతల్లే ఉంది. దానికదెంత పని?"

"ఎంతసేపైంది ఎత్తుకుపోయి?"

"ఇప్పుడే, అయిదు నిమిషాలు కూడా కాలేదు"

'కోళ్లు మరి ఏమీ గోలచెయ్యటం లేదే?"

"ఏందయ్యా, మీరనేదీ?"అతను కోపంగా రెట్టించాడు.

'అదికాదు, నువ్వు సరిగా చూడలేదేమో!" అన్నాడు విశ్వనాథం, ఆ పిల్లిమీద అతనికున్న సదభిప్రాయం పోగొట్టుకోటం ఇష్టం లేక.

"చాలు చాల్లెండి, ఇంకా ఎనకేసు కొస్తుండారు."

విశ్వనాథానికి ఏమనటానికీ తోచలేదు. ఆ

వ్యక్తి చెప్పింది అంతగా విశ్వసించటానికి వీలుగా లేదు. ఆపిల్లి అతనికి ఇబ్బందిగా ఉందనటం నిర్వివాదాంశం. దాన్ని ఎలాగైనా వొదిలించ చూస్తున్నట్టు, అందుకేదో కుంటికారణం చూపుతున్నట్టు, నాకు అనుమానం కలిగింది. అయితే గట్టిగా ఏమనటానికీ వీలులేదు. సమయానికే మబ్బు అడ్డురావటం, ఆకాశం గర్జించటం, ఆ సమయంలో పిల్లి గోడమీద ఉందో లేదో తెలియనియ్యకుండా చెయ్యడం వల్ల ప్రత్యక్ష సాక్ష్యం పిల్లి తరఫున దొరకదు.

"రేపు చెబుతా, ఈ పిల్లి సంగతీ, ఆ అబ్బాయి సంగతీ." కోపంగా అతను గోనె సంచిలోని పిల్లిని ఒక తన్ను తన్నాడు. వెంటనే 'అబ్బా' అని కాలు పట్టుకున్నాడు. దెబ్బకి పిల్లి "మ్యావు" అని అరవాలిసింది, అది కిక్కురుమనక ఇతను మూలగటం మాకు పరమాశ్చర్యం కలిగించింది.

"ఇది పిల్లా, రాయా? ఉక్కు శరీరం ఆల్లే ఉంది" అని మరోటి ఇచ్చుకున్నాడు. మళ్ళీ "అబ్బా" అన్నాడు. పిల్లి కిమ్మనలేదు. ఆవ్యక్తి సంభ్రమాశ్చర్యాలతో నోరు తెరుచుకుని గోనె సంచీలోని పిల్లిని, సంచె పట్టుకు విసిరేశాడు. పడినచోటనించి పిల్లి కదలలేదు. కదలటానికి ప్రయత్నించలేదు. కాళ్లు ముడవలేదు. ముగ్గురం దానివైపు ఆశ్చర్యంగా చూశాము. సత్యాగ్రహం చేస్తోందా అనిపించింది. దగ్గిరకి వెళ్ళి చూశాము. విశ్వనాథం దగ్గరగా వెళ్ళి పరీక్షించాడు, అటూ, ఇటూ కదిపాడు. అతనికి ఫక్కున నవ్వొచ్చింది. నావైపూ, అతనివైపూ చూసి ఆదేసనిగా నవ్వాడు. అవ్యక్తికి ఒక్క నిమిషం వరకూ, ఏమనటానికీ నోరురాక తరవాత రుసరుస లాడుతూ అక్కడినించి వెళ్లసాగాడు.

విశ్వనాథం ఊరుకోలేక గట్టిగా అన్నాడు.

"పాపం. ఎందుకండీ, ఈ నోరులేని నల్ల పిల్లిమీద అన్ని అబద్ధాలు చెప్పారు?"

ఆవ్యక్తి వినిపించుకోనట్టు విసురుగా వెళ్ళిపోయాడు.

"అతనలా యెందుకు చెప్పాడంటావు?" అన్నాను.

"అతను చెప్పిన దాంట్లోనే ఉందిగా సమాధానం" అన్నాడు విశ్వనాథం. కాసేపాగి అన్నాను, విశ్వనాథాన్ని అపహసిస్తూ,

"ఈ నల్లపిల్లి ప్రియురాలు చచ్చిపోయింది ఈ ప్రదేశంలోనే కాబోలు."

వాడు ముఖం చిట్లించుకున్నాడు.

"సరే లే పోదాం, పద. అనవసరంగా టైం వేస్టయింది."

నాకుమాత్రం ఈ విషయం ఏదో పూర్తిగా తెలుసుకున్నాం అనే సంతృప్తి కలిగింది. వెళ్ళిపోటానికి సిద్ధమై ఇద్దరం వెనక్కి తిరిగాం. గత నాలుగయిదు రోజుల్నించీ మాకు సమస్యగా పరిణమించిన ఆ నల్ల పిల్లి మకాం వేసే స్థలంవైపు యథాలాపంగా ఇద్దరం చూశాం. కలయో, వైష్ణవ మాయయో! ఎవరికీ నోటి మాట రాలేదు. ఆ ప్రహరీ గోడ మీద ఓ పెద్ద నల్ల పిల్లి భీకరమైన నేత్రాలతో మావైపు చూస్తూ నోట్లోని కోడిపిల్లతో సహా ప్రత్యక్షమైంది.

క్షణకాలం భావశూన్యమైన తరువాత ఆలోచించటానికి ప్రయత్నించే లోపుగా సన్నగా, నిర్దుష్టంగా ఓ ఈల వినపడ్డది. ఆపిల్లి తాపీగా ఈల వినపడ్డ వైపుకి చూసి గోడమీంచి దొడ్లోకి ఒక్క దూకు దూకి చీకటిలోకి అదృశ్యమైంది

దేశరక్షణ కార్యకలాపాలకు, విదేశాలకు సహాయపడే కార్యక్రమానికి గాను ఒకచెంప ఎక్కువ మొత్తాలను సుంకాలుగా చెల్లిస్తూ కూడా అమెరికన్లు జీవకారుణ్య సంఘాలకు చాలా మొత్తాలు విరాళంగా ఇస్తున్నారని ఇటీవల జరిగిన ఒక పరిశీలనవల్ల స్పష్టమయింది. ఆ విధంగా 1951 వ సంవత్సరంలో అమెరికన్లు మొత్తం 420,00,00,000 డాలర్లు విరాళంగా ఇచ్చారు.